తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శనివారం-10- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 223 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## కృష్ణా–గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులపై
# రాజీ లేదు

- సీతారామ ఎత్తిపోతల పథకం పనులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష
- కాళేశ్వరం, మేడిగడ్డపై భారాస హయాంలో అవకతవకలు
- తెలంగాణకు నష్టం కలిగించే ప్రాజెక్టులను కోర్టులో అడ్డుకుంటాం
- రైతుల అభ్యున్నతికి సాగునీరు, వ్యవసాయ పథకాలపై దృష్టి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాలో చుక్క నీటినీ వదులుకోబోమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. రాష్ట్ర నీటి హక్కుల కోసం పోరాడుతూనే.. కృష్ణాగోదావరి నదులపై చేపట్టిన ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో సీతారామ ఎత్తిపోతల పథకం నాలుగో పంప్‌హౌస్ వద్ద అధికారులతో శుక్రవారం ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కోదాడలోనూ ఆయన మాట్లాడారు.

మిగతా 2లో



# నీళ్ల వివాదాలపై రాజకీయాలు వద్దు

### పరస్పర సహకారంతో శాశ్వత పరిష్కారం కావాలి: సీఎం రేవంత్‌రెడ్డి



- పొరుగు రాష్ట్రాలతో స్నేహపూర్వక సంబంధాలే లక్ష్యం
- ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు వద్దు
- ఏపీ అభ్యంతరాలతో నిలిచిన కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు
- పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యం
- నీరు, విద్యుత్, మౌలిక వసతులపై రాష్ట్రాల సమన్వయం అవసరం
- పరిశ్రమల అభివృద్ధికి అనుకూల పాలసీల రూపకల్పన
- గ్లోబల్ నగరాలతో పోటీ పడే దిశగా తెలంగాణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

'నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ధి పొందే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదు. సరిహద్దు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలతో మేము ఎలాంటి వివాదాలను కోరుకోవడం లేదు. పరస్పర సహకారాన్ని కోరుకుంటున్నాం. తద్వారా అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాన్ని ఆశిస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన తెలంగాణ ప్రాజెక్టులకు పొరుగు రాష్ట్రాలు అడ్డంకులు సృష్టించొద్దు. మీరు సృష్టించే సమస్యల వల్ల తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావడం లేదు. బ్యాంకుల నుంచి రుణాలే కాదు.. కేంద్రం నుంచి ఆర్థిక సహకారం కూడా అందకుండా పోతోంది. ఏదైనా సమస్య ఉంటే కూర్చొని మాట్లాడుకుందాం. సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపిద్దాం.

మిగతా 2లో



## భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకం

### రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ: , (తెలంగాణ ముచ్చట్లు)

భాజపా పాలిత ప్రభుత్వాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భాజపాను 'భ్రష్ట్ జనతా పార్టీ'గా అభివర్ణించిన రాహుల్.. అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని దుయ్యబట్టారు. పేదలు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల అభివృద్ధిలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "భాజపా పాలనలో పేదలు, నిస్సహాయులు, కార్మికులు, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

2లో



## డీజీపీ నియామక ప్రక్రియను 4 వారాల్లో పూర్తిచేయండి

రాష్ట్ర డీజీపీగా శివధర్‌రెడ్డిని నియమించడంపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఆయన నియామకం చట్టవిరుద్ధంగా జరిగిందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయలేదని పేర్కొంటూ టీ ధన్‌గోపాల్‌రావు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 4 వారాల్లోగా డీజీపీ నియామక ప్రక్రియను పూర్తిచేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమా

- ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట
- బీమా అమలుకు బ్యాంకర్లతో సంప్రదింపులు పూర్తి
- గత బకాయిలను క్రమం తప్పకుండా విడుదల చేస్తున్న ప్రభుత్వం
- 5.14 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలకు లబ్ధి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలోని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమాను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

మిగతా 2లో

## సైబర్ నేరాలపై పోరులో హైదరాబాద్ పోలీసుల విప్లవాత్మక అడుగు

- సైబర్ నేర బాధితులకు ఇంటి నుంచే ఫిర్యాదు సౌకర్యం
- 'సీ-మిత్ర' ద్వారా వర్చువల్ హెల్ప్‌డెస్క్ సేవలు
- ఏఐ సహాయంతో ఫిర్యాదు డ్రాఫ్ట్, సులభంగా ఎఫ్ఐఆర్ నమోదు
- జీరో ఎఫ్ఐఆర్ విధానం ద్వారా కేసుల వేగవంతమైన బదిలీ
- నకిలీ కాల్స్ పట్ల జాగ్రత్త: అధికారిక వివరాల వెల్లడి



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక విప్లవంతో పాటే సైబర్ నేరాలు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్‌లు, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్

మిగతా 2లో



## వీధి కుక్కలపై ఫిర్యాదులు శాంతిభద్రతల పరిధిలోవే

వీధి కుక్కలకు ఆహారం పెడుతున్న మహిళలపై దాడులు, వేధింపులు జరుగుతున్నాయన్న ఆరోపణలపై విచారణ జరపలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'ఇది శాంతి భద్రతల సమస్య. బాధితులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయవచ్చు' అని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాతో కూడిన ధర్మాసనం తెలిపింది. అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలను పరిశీలించేందుకూ తిరస్కరించింది. అలాంటి ఘటనలపై కేసు పెట్టకుండా మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారంటూ న్యాయవాదిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ప్రశ్నించారు.

7లో

# మునిసిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి..

- పురపాలికల్లో గులాబీ జెండా ఎగరేయాలంటూ నేతలకు కేటీఆర్ పిలుపు
- కరీంనగర్ బీఆర్ఎస్‌కు కంచుకోట: కేటీఆర్ వ్యాఖ్య
- ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచన
- ఉర్దూ యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ సర్కారుపై తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పంచాయతీ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో మునిసిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. పురపాలికల్లో గులాబీ జెండాలనెగురవేసేందుకు కృషి చేయాలని శుక్రవారం జరిగిన సమావేశంలో కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నేతలకు దిశా నిర్దేశం చేశారు. అన్ని జిల్లాల నేతలతోనూ రోజువారీ సమావేశమవుతామని ఆయన తెలిపారు..

మిగతా 2లో



# థియేటర్లకు సమయం ఉంది.. నిరుద్యోగులకు లేదా?

### సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఘాటు విమర్శలు

- అశోక్‌నగర్ లైబ్రరీకి వెళ్లే దమ్ముందా? అంటూ సీఎంను నిలదీత
- జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులకు మోసం చేశారని విమర్శ
- కాళేశ్వరం కూలిందన్న వ్యాఖ్యలపై రేవంత్‌పై ఫైర్
- ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీతో కేసీఆర్ కలలు నిజమయ్యాయని వ్యాఖ్య
- సిద్దిపేట జిల్లా రద్దు చేస్తే ఊరుకోమని హెచ్చరిక

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

'సినిమా థియేటర్ ఓపెనింగ్‌కు వెళ్తున్న రేవంత్‌రెడ్డికి అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీకి వెళ్లే దమ్ముందా?.. వేలాది మంది పోలీసుల బందోబస్తు మధ్య థియేటర్‌కు వెళ్లేందుకు సమయం ఉందిగానీ, నిరుద్యోగులను కలిసే టైం లేదా..? ప్రారంభించే సినిమా థియేటర్ పకనే అశోక్‌నగర్ లైబ్రరీ ఉన్నది. అకడి వెళ్లి నిరుద్యోగులతో మాట్లాడు.. ఎన్నికల సమయంలో ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు అన్నావ్.. ఎందుకు ముఖం చూపడం లేదు?' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. లైబ్రరీకి వెళ్లకుండా పారిపోతే నిరుద్యోగులను మోసం చేసినట్టేనని, జాబ్ క్యాలెండర్ జాబ్‌లెస్ క్యాలెండర్ చేశారని, ఉద్యోగాల నోటిఫికేషన్లే ఇవ్వలేదు,

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నీళ్ల వివాదాలపై రాజకీయాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం ఏపీ ఒక అడుగు ముందుకేస్తే... పది అడుగులు ముందుకు వేసే తత్వం మాది. పక్క రాష్ట్ర ప్రజా ప్రతినిధులకు ఓ సూచన చేస్తున్నా. నీళ్ల వివాదాన్ని రాజకీయం చెయ్యొద్దు. రాజకీయాలకు అతీతంగా చర్చించి, సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపిద్దాం. ఇందుకోసం న్యాయ స్థానాలు, ఇతరుల సమక్షంలో కూర్చొనే కంటే మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడం ఉత్తమం. మీకు పంచాయితీలు కావాల్నా? నీళ్లు కావాల్నా? నేనైతే జలాలు కావాలనే కోరుకుంటా. వివాదాలు కావాల్నా? పరిష్కారం కావాల్నా? అంటే పరిష్కారమే కోరుకుంటా..'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగర శివార్లలోని రావిర్యాల ఫ్యాబ్‌సిటీలో 'సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్'తయారీ యూనిట్‌ను ప్రారంభించిన తర్వాత ఆయన మాట్లాడారు.




'కృష్ణా బేసిన్‌లో పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతలతో పాటు, డిండి, ఎస్ఎల్‌బీసీ, బీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలోనే మంజూరయ్యాయి. కానీ ఏపీ అభ్యంతరాల వల్ల వాటికి పర్యావరణ, సీడబ్ల్యూసీ అనుమతులు, బ్యాంకులు, కేంద్రం నుంచి నిధులు రావడం లేదు. ఇది రాష్ట్రానికి భారంగా పరిణమిస్తోంది. ఇక్కడ డేటా సెంటర్లు పెట్టాలంటే విద్యుత్‌తో పాటు నీరు కూడా కీలకం. కృష్ణానది నుంచి ఇక్కడికి నీటిని తరలించాలన్నా..యాదాద్రి నుంచి కరెంట్ తరలించాలన్నా.. పరస్పర సహకారం అవసరం. తెలంగాణకు పోర్టు రావాలన్నా..ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం పోర్టు వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వేయాలన్నా పక్క రాష్ట్రంతో సయోధ్య, సహకారం అవసరం. అలాగే అమరావతి అభివృద్ధి కావాలంటే హైదరాబాద్ సహకారం కూడా ఉండాలి..'అని సీఎం అన్నారు.

'రాష్ట్రంలో పారిశ్రామిక, ఇంధన, పర్యాటక, ఎండోమెంట్, మెడికల్ పాలసీలను తీసుకొచ్చాం. త్వరలో ఎడ్యుకేషన్ పాలసీ కూడా తీసుకురానున్నాం. ఐటీ, ఫార్మా, డేటా సెంటర్ల రంగంలో రాష్ట్రం పోటీ పడుతోంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి అనుగుణంగా పాలసీ డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గుర్గాంవ్‌తో తెలంగాణ పోటీ పడుతోందనే చర్చ పదేపదే జరుగుతోంది. దీనికి ఫుల్‌స్టాఫ్ పెట్టి జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో పోటీ పడాలని ఆలోచన చేస్తున్నాం.

యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు ప్రారంభించే పరిశ్రమలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుంది. సహాయ సహకారాలు అందజేసి ప్రోత్సహిస్తుంది. దేశ బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. నాలుగు కోవిడ్ వ్యాక్సిన్లలో మూడు ఇక్కడి నుంచే వచ్చాయి. సిలికాన్ వ్యాలిలోని ఐటీ కంపెనీలకు సీఈఓలుగా వ్యవహరిస్తున్న వారు హైదరాబాద్‌లోనే చదువుకున్నారు. సక్సెస్ స్టోరీలు సృష్టించాలి. ప్రభుత్వం ఇప్పటికే 75 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చింది. మరో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరికి ప్రైవేటు రంగంలోనూ అవకాశం కల్పించాలి. ఐఎస్ఎస్‌ల కన్నా ప్రైవేటు రంగంలోనే ప్యాకేజీలు అధికంగా ఉన్నాయి. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ప్రైవేటు రంగంలోని అవకాశాలను అందిపుచ్చుకోవాలి..'అని ముఖ్యమంత్రి సూచించారు.

మెడికేర్, ఫార్మా, లైఫ్‌సైన్స్‌కు సంబంధించిన ఎకో సిస్టమ్‌లో నాలుగు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ప్రధానంగా ఉంటుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. పరిశ్రమలకు అనుగుణంగా పాలసీలు ఉండాలని భావించి, ఆ కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. విదేశీ పెట్టుబడులతో ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించామని, ఇక్కడ పెట్టుబడులు పెట్టి స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని హామీ ఇచ్చారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ స్థాయి షాపింగ్, డైనింగ్, వినోదాల సమ్మేళనంగా నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన అల్ట్రా ప్రీమియం ఓడిఎన్ మాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, అజహరుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఓడిఎన్ మాల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# కృష్ణా–గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులపై రాజీ లేదు

(మొదటి పేజీ తరువాయి)



కృష్ణా జలాల వాటా విషయంలో భారాస హయాంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. రాబోయే ఆరు నెలల్లో ప్రాజెక్టులకు అవసరమైన భూములను సేకరించాలని అధికారులను ఆదేశించారు. గోదావరిపై తుమ్మిడిహెట్టి వద్ద రూ.38 వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే గ్రావిటీ కెనాల్ ద్వారా 16 లక్షల ఎకరాలకు సాగునీరందేదని చెప్పారు. భారాస ప్రభుత్వం డిజైన్ మార్చి మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మిస్తే అది కూలిపోయిందని విమర్శించారు. రూ.లక్ష కోట్లకుపైగా వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం.. కమీషన్ల కక్కుర్తితో కూలిపోయిందని ధ్వజమెత్తారు. రాబోయే మూడేళ్లలో కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న పోలవరంనల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్ అనుమతించలేదని డిసెంబరు 4న కేంద్రమే లేఖ రాసిందన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు నష్టం కలిగించే ప్రాజెక్టుల విషయంలో సుప్రీంకోర్టులో పక్కాగా వాదనలు వినిపించి వాటిని ఆపేలా చూస్తామన్నారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. జూన్ నాటికి సీతారామ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామని తెలిపారు.

వ్యవసాయ రంగం ద్వారా 2047 నాటికి 400 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం 'వ్యవసాయ యాంత్రీకరణ', 'ప్రకృతి వ్యవసాయం' పథకాలను మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతి కోసం వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. సుమారు 1.31 లక్షల మంది రైతులకు రూ.101 కోట్లతో పరికరాలు అందించనున్నట్లు వివరించారు. పెండింగ్‌లో ఉన్న బోనస్ సొమ్మును త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ.1.02 కోట్ల ప్రమాద బీమా



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ చేర్చే ప్రభుత్వ ఉద్యోగులను తమ కుటుంబ సభ్యులుగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం భావిస్తుందని చెప్పారు. రూ.1.02 కోట్ల ప్రమాద బీమాకు సంబంధించిన ప్రక్రియను అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంకర్లతో సంప్రదింపులు ముగిసినట్టు భట్టి వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలను ప్రతినెలా క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నామన్నారు. ఇప్పటికే సింగరేణి, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, జెన్‌కో పరిధిలోని ఉద్యోగులందరికీ కోటికి పైగా ప్రమాద బీమాను అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 5.14 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

# మునిసిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలి..

(మొదటి పేజీ తరువాయి)

తమ పరిధిలోని మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థ ఎన్నికలకు తాము సిద్ధమని కేటీఆర్‌కు కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ నేతలు వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండున్నర దశాబ్దాలుగా పార్టీ వెంట నిలిచిన కరీంనగర్.. బీఆర్ఎస్‌కు కంచుకోట అని అభివర్ణించారు. అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేసినా, అడ్డదారులు తొక్కినా.. పంచాయతీ ఎన్నికల్లో 4000కి పైగా పంచాయతీల్లో బీఆర్ఎస్ గెలవడం రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖ చిత్రానికి స్పష్టమైన సంకేతమన్నారు. గ్రామాలు, పట్టణాలకతీతంగా ప్రజలు గులాబీ జెండా వైపు చూస్తున్నారన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో ప్రభుత్వ వైఫల్యాలను వివరించి ప్రజల్లో చైతన్యం తేవాలని కేటీఆర్ పేర్కొన్నారు.

హైదరాబాద్‌కే తెలమానికంగా ఉన్న దేశంలోని ఏకైక ఉర్దూ యూనివర్శిటీని నిర్వీర్యం చేయడానికి కాంగ్రెస్ సర్కారు ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో శుక్రవారం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులతో కేటీఆర్ సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిని అక్రమంగా తీసుకుని రియల్ ఎస్టేట్ అవసరాలకు వినియోగించాలని చూస్తున్నారని మండి పడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకొనే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ



భూములను అన్యాక్రాంతం చేయడమేనా..? వారిని కాపాడటమా అని ప్రశ్నించారు.

# సైబర్ నేరాలపై పోరులో హైదరాబాద్ పోలీసుల విప్లవాత్మక అడుగు

(మొదటి పేజీ తరువాయి)

ఫ్రాడ్స్ వంటివి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయాల్లో బాధితులకు అండగా నిలుస్తూ, వారు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే శ్రమ లేకుండా త్వరితగతిన న్యాయం అందించేందుకు హైదరాబాద్ పోలీసులు దేశంలోనే తొలిసారిగా ఒక విప్లవాత్మక అడుగు వేశారు. అదే.. 'సీమిత్ర' దీని ద్వారా ఫిర్యాదు చేయడం మొదలుకొని, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకూ అంతా ఇంటి నుంచే పూర్తవుతుంది. సాంకేతికత ద్వారా పోలీసులే మీ వద్దకు వచ్చే అద్భుతమైన 'వర్చువల్' పరిష్కారమిది.

సైబర్ నేర బాధితుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన ఒక 'వర్చువల్ హెల్ప్‌డెస్క్' ఈ సీమిత్ర. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఫిర్యాదు ప్రక్రియను పూర్తి చేయడం దీని ప్రధాన ఉద్దేశం. సాధారణంగా సైబర్ మోసం జరిగినప్పుడు బాధితులు '1930' నంబర్‌కు ఫోన్ చేసి గానీ, జాతీయ సైబర్ పోర్టల్ (https://www.cybercrime.gov.in/) లో గానీ ఫిర్యాదు చేస్తారు. అయితే, ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు కోసం కచ్చితంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. కానీ 'సీమిత్ర' రాకతో ఇక ఆ అవసరం ఉండదు. సమస్త ఫిర్యాదు ప్రక్రియ ఇంటి నుంచే పూర్తవుతుంది.

చాలామంది బాధితులకు ఫిర్యాదులో ఏం రాయాలి? ఏ సెక్షన్లు వర్తిస్తాయి? అనే సందేహాలు ఉంటాయి. అటువంటి వారికి 'సీమిత్ర' బృందమే స్వయంగా ఫోన్ చేసి, వివరాలు సేకరించి, ఏఐ సాంకేతికతతో పక్కాగా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి బాధితులకు పంపిస్తుంది. బాధితులు దాన్ని ప్రింట్ తీసుకుని, సంతకం చేసి సైబర్ మిత్ర హెల్ప్ డెస్క్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్, క్రైమ్ పోలీస్ స్టేషన్, కమిషనర్ ఆఫీస్, బషీర్‌బాగ్, హైదరాబాద్ 500029 అనే అడ్రస్‌కు పోస్ట్ లేదా కొరియర్ ద్వారా పంపించాలి. అంతేకాదు, సైబర్ క్రైం పీఎస్ వద్ద డ్రాప్ బాక్స్ కూడా అందుబాటులో ఉంటుంది. సంతకం చేసిన ఫిర్యాదు కాపీలను అందులో వేయొచ్చు. ఆ ఫిర్యాదుల ఆధారంగా ఎఫ్ఐఆర్‌ను సైబర్ క్రైం పోలీసులు నమోదు చేస్తారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నివసిస్తున్న సైబర్ నేర బాధితులు మాత్రమే సీమిత్ర సేవలను పొందేందుకు అర్హులు.

సీమిత్ర విధానం వల్ల పౌరుల సమయం ఆదా అవ్వడమే కాకుండా, స్టేషన్ సిబ్బందికి దర్యాప్తుపై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. 1930కి, జాతీయ సైబర్ పోర్టల్‌కు వచ్చే ఫిర్యాదుల్లో కేవలం 18% మాత్రమే ఎఫ్ఐఆర్‌లుగా మారుతున్నాయి. సీమిత్ర ద్వారా దీనిని 100 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది. ప్రస్తుతం లక్ష రూపాయలకు మించిన సైబర్ మోసాలను సైబర్ క్రైమ్ స్టేషన్‌లోనూ, అంతకంటే తక్కువైతే స్థానిక పోలీస్ స్టేషన్‌లోనూ నమోదు చేస్తున్నారు. అయితే, ఇకపై 'సీమిత్ర' విధానం ద్వారా 3 లక్షల లోపు ఉన్న కేసులను జీరో ఎఫ్ఐఆర్ చేసి, తదుపరి దర్యాప్తు నిమిత్తం సంబంధిత స్థానిక పోలీస్ స్టేషన్లకు బదిలీ చేయడం జరుగుతుంది. 3 లక్షల పైన ఉన్న ఫిర్యాదులను సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

సీమిత్ర సేవలను పొందాలంటే బాధితులు 1930కి కాల్ గానీ, లేదా జాతీయ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే సరిపోతుంది. ఆ వెంటనే సీమిత్ర బృందంలోని వర్చువల్ పోలీస్ ఆఫీసర్లు బాధితులకు కాల్ చేసి, వర్చువల్ పద్ధతిలో ఫిర్యాదు చేసే విధానాన్ని వివరిస్తారు. సిద్ధం చేసిన ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను బాధితులకు పంపిస్తారు. బాధితులు దానిని ప్రింట్ తీసుకుని, సంతకం చేసి పోస్ట్/కొరియర్ లేదా డ్రాప్ బాక్స్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. భవిష్యత్తులో డిజిటల్ సంతకం ఆప్షన్ కూడా పరిశీలనలో ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆ వివరాలను సందేశరూపంలో బాధితులకు పంపిస్తారు.

ఈ వర్చువల్ హెల్ప్‌డెస్క్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. 24 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం, ఏఐ పరిజ్ఞానంతో బాధితులకు సేవలు అందిస్తుంది. సీమిత్ర అధికారిక ల్యాండ్‌లైన్ నంబర్: 04041893111 నుంచి మాత్రమే కాల్స్ వస్తాయి. వాట్సాప్ ద్వారా సమాచారం కేవలం 87126 సిరీస్ నంబర్ల నుంచే వస్తుంది. సిమిత్ర పేరుతో వచ్చే నకిలీ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. సిమిత్ర సిబ్బంది ఎప్పుడూ ఓటీపీ గానీ, డబ్బులు గానీ అడగరు. సీమిత్ర కేసును దర్యాప్తు చేయదు. పోయిన డబ్బును వెనక్కి ఇప్పిస్తామని హామీ ఇవ్వదు. చట్టపరమైన సలహాలు కూడా ఇవ్వదు. కేసు స్టేటస్ తెలుసుకోవాలంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌నే సంప్రదించాలి.

# థియేటర్లకు సమయం ఉంది.. నిరుద్యోగులకు లేదా?

(మొదటి పేజీ తరువాయి)

అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు ఎలా సాధ్యమని అని మంత్రి శ్రీధర్‌బాబు అనడం హాస్యాస్పదమని, ఎన్నికల సమయంలో నిరుద్యోగులను నమ్మించి, ఇప్పుడు నయవంచన చేశారని హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో హరీశ్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్, నిరుద్యోగభృతి, స్కూటీల కథపై

కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని, రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవస్థ అస్తవ్యస్తమైందని హరీశ్‌రావు దుయ్యబట్టారు. యూరియా కోసం యాప్‌లు పెట్టి రైతులను ఇబ్బందులు పెడుతుందని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఎవరు కూడా ఇబ్బందులుపడకుండా ఎరువులు ఇంటికే చేరేవని గుర్తుచేశారు. ఎరువులు ఇయ్యచేతకాక యాప్‌లు, మ్యాప్‌లు, కార్డుల కథ పెట్టారని రేవంత్ తీరును ఎండగట్టారు.

సిద్దిపేట దశాబ్దాల కల గోదావరి జలాలను తీర్చింది కేసీఆర్ సర్కారే అని హరీశ్‌రావు చెప్పారు. 2016 17లో నియోజకవర్గంలో యాసంగి పంట రివ్యూ చేస్తే 8వేల ఎకరాల వరి ఉండే ఇప్పుడు 80 వేల ఎకరాలకు చేరిందని ప్రకటించారు. కాళేశ్వరం నీళ్లు రాకపోతే 80 వేల ఎకరాలు ఎలా పండుతుందని, అలాంటిది కాళేశ్వరం కూలిందంటున్న రేవంత్‌రెడ్డిది నోరా.. మోరా.. అని మండిపడ్డారు. కాళేశ్వరంపై కక్షకట్టి పగబట్టారని రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. ఇప్పటికైనా కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి, మేడిగడ్డ బ్యారేజ్ అవసరం లేకుండానే నదీ ప్రవాహం ద్వారా కన్నెపల్లి పంపుహౌస్‌ను ప్రారంభించి రైతులకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందని, కానీ కాంగ్రెస్ సర్కార్ కత్తికట్టిందని దుయ్యబట్టారు.

సిద్దిపేట నియోజకవర్గంలో ఆయిల్ పాం ఫ్యాక్టరీ పూర్తిస్థాయిలో నూనె ఉత్పత్తిని ప్రారంభించిందని హరీశ్‌రావు చెప్పారు. ఫ్యాక్టరీలో గెలల నుంచి వచ్చే క్రూడ్ పామాయిల్ ఒకవైపు, నట్స్ నుంచి వచ్చే ఆయిల్ ఇంకోవైపు చూస్తుంటే సంతోషంగా ఉందని, దీంతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ కలలు నిజమయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు.

సముద్రతీరానికే పరిమితమైన ఆయిల్‌పామ్ తోటలు ఉత్తర తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వ్యాపించాయంటే కేవలం కేసీఆర్ కృషి.. విజన్‌తోనే సాధ్యమైనదని హరీశ్‌రావు చెప్పారు. రైతులకు మేలు కలుగాలనే తపన కేసీఆర్‌ది అని, నీళ్లు, కరెంట్ ఇచ్చి పెట్టుబడి సాయం అందజేసి అధిక ఆదాయం వచ్చే ప్రతి జిల్లాకూ నర్సరీ పెట్టించి, ఫ్యాక్టరీ మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం మానేసిందని దుయ్యబట్టారు. రిఫైనరీ, ప్యాకింగ్ అప్పుడే మంజూరు చేస్తే ఆ పనులను కూడా కాంగ్రెస్ సర్కార్ ప్రారంభించలేదని, పనులు తొందరగా చేపట్టాలని మంత్రి తుమ్మలను కోరుతానన్నారు.

దేవుళ్ల మీద ఒట్టుపెట్టి రుణమాఫీ చేసినట్టు మోసం చేశాడని రేవంత్‌ను ఉద్దేశించి హరీశ్‌రావు విమర్శించారు. సగం మంది రైతులకు కూడా రుణమాఫీ చేయలేదని, సిద్దిపేట నియోజకవర్గంలోనే 22 వేల మందికి మాఫీ లేదని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నాడని, కేసీఆర్ కట్టిన వాటిని ఆయన కత్తిరిస్తున్నాడని, ఉన్న పనులను ఆపుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు.

రేవంత్ సిద్దిపేట జిల్లాను రద్దు చేస్తే ఊరుకోబోమని హరీశ్ హెచ్చరించారు. కోపం ఉంటే తనతోనే చూసుకోవాలని, సిద్దిపేట ప్రజలపై చూపొద్దని హితవు పలికారు. 40 ఏండ్ల సిద్దిపేట ప్రజల జిల్లా కలను కేసీఆర్ నిజం చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి జిల్లాలు ఎకువయ్యాయని సాకుచూపి రద్దు చేసి సంగారెడ్డిలో కలుపాలని కుట్ర చేస్తున్నారని విరుచుకుపడ్డారు. రేవంత్ కుట్రలను అడ్డుకుని సిద్దిపేట అస్తిత్వాన్ని కాపాడుకుంటామన్నారు.

కొంతమంది కాంగ్రెస్ నేతలు నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ సిద్ధమయ్యాక మూర్ఖంగా తామే చేశామని మాట్లాడుతున్నారని హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. తాము ఎంత కష్టపడ్డమో తెల్వదా అని సూటిగా ప్రశ్నించారు. అప్పట్లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆయిల్ పామ్ తోటలో భోజనం పెడితే చూసి తనకు ఆలోచన వచ్చి సిద్దిపేటలో ఆ తోటలు ఎందుకు పెట్టొద్దని కష్టపడి తీసుకొచ్చినట్టు గుర్తు చేశారు.

సిద్దిపేట రైతులకు అధిక ఆదాయం దక్కాలనే తాపత్రయంతో ఈ పని చేశామని, 2021 జనవరిలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ వారు సిద్దిపేటకు సూట్ అవుతుందని చెప్పడంతో కేసీఆర్‌ను కలిసి పామాయిల్ తోటలు పెంచడానికి అవకాశం ఇవ్వాలని కోరినట్టు గుర్తు చేశారు. మొదటి మొక్క మార్చి 2021లో పెడితే ఏప్రిల్ 2022లో 300 కోట్లతో ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేసి ప్రణాళికాబద్ధంగా పనిచేశామని చెప్పారు. ఫ్యాక్టరీ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 3,500 టన్నుల గెలలు క్రషింగ్ చేశామని, దాదాపు 600 మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్, 120 మెట్రిక్ టన్నుల కెర్నల్ ఆయిల్ ఉత్పత్తి అయ్యిందని చెప్పారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శనివారం-10- జనవరి 2026




## హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువు పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**నాచారం, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చెరువులో విపరీతంగా గుర్రపు డెక్క పెరిగి ఉండటంపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గుర్రపు డెక్క పూర్తిగా తొలగించే వరకు ఎలాంటి బిల్లులు రాయవద్దని, తక్షణమే తొలగింపు పనులు ప్రారంభించాలని అధికారుల ను ఎమ్మెల్యే ఆదేశించారు. దోమల కారణంగా హెచ్ఎంటి నగర్, ఇంద్రానగర్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే చెరువు కట్టపైకి వెళ్లేందుకు ఒకే ఒక్క మార్గాన్ని మాత్రమే ఉంచి, మిగిలిన అన్ని మార్గాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చెరువుల సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నిత్యానందం, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, ఏఈ ఆంజనేయులు, ఇంజనీరింగ్ డీఈ ఉమామహేశ్వరి, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్, హెచ్ఎంటి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నాచారం డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.2 లక్షల ఎల్ఓసి మంజూరు

**పెద్దమందడి,జనవరి9(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మందడి కృష్ణమ్మ భర్త కరెన్న కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మానవీయతతో వెంటనే చర్యలు తీసుకుని ఆయన చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్ఓసి ను మంజూరు చేయించారు.మంజూరైన ఆర్థిక సహాయాన్ని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని, అవసరమైన ప్రతి సందర్భంలో తమ వంతు సహాయాన్ని అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పామిరెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం, మాజీ సర్పంచ్ సిద్ధయ్య తిక్కన్న, మాజీ ఎంపీటీసీ ఇంద్ర లక్ష్మారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



## మల్కాజిగిరి జోనల్ పరిధిలో అడిషనల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి పర్యటన

**మల్కాజిగిరి, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి జోనల్ పరిధిలో అడిషనల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఏ.ఓ.సి నుంచి ఆర్.కె.పురం వరకు ఉన్న ప్రధాన రహదారులు, (ఆర్ యు బి) మరియు (ఆర్ఓబీ )లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రధాన రహదారుల స్థితిగతులు, ట్రాఫిక్ సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై అధికారులు అప్రమత్తంగా ఉండి వెంటనే స్పందించాలని, సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ జకీయా సుల్తానా, ఉప కమిషనర్ గోపాల్ రావు, సిటీ ప్లానర్ శ్రీనివాస్, సంగీతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.







## గ్రామాల్లో సుపరిపాలన అందించాలి: మంత్రి పొంగులేటి

- సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాలి
- సీతారామ ప్రాజెక్టు ద్వారా ఐదు మండలాలకు సాగునీరు
- నూతన సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన సభలో వెల్లడి

**ఖమ్మం బ్యూరో, జనవరి 9(తెలంగాణ ముచ్చట్లు)**

అభివృద్ధి లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు సుపరిపాలన అందిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని సింగరేణి పాఠశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ పరిధిలో నూతనంగా గెలిచిన సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన ఘన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**ఇంటింటికీ సంక్షేమం.. సర్పంచులదే బాధ్యత**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో అందించిన సుపరిపాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో 69 శాతం విజయాన్ని అందించారని స్పష్టం చేశారు. "సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం వంటి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలి. ఇందులో సర్పంచులు కీలక పాత్ర పోషించి, పథకాలను ఇంటింటికీ చేర్చాలి" అని సూచించారు.

**త్వరలోనే మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు**

ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ అధైర్య పడొద్దని, మరో మూడు విడతల్లో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఆయన.. డ్వాక్రా రుణాల మాఫీ, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు.


**నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత**

ఇల్లెందు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సాగు, తాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి తెలిపారు. "సీతారామ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తాం. దీని కోసం వచ్చే బడ్జెట్ లో అవసరమైన నిధులు కేటాయిస్తాం" అని ప్రకటించారు. రాబోయే మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో కార్యకర్తలు సత్తా చాటాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం : మంత్రి పొంగులేటి

- మున్సిపాలిటీల అభివృద్ధికి సర్కార్ కట్టుబడి ఉంది
- రూ. 3.17 కోట్ల పనుల శంకుస్థాపనలో మంత్రి వ్యాఖ్యలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 9(తెలంగాణ ముచ్చట్లు)**





ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ. 3.17 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇల్లెందు మున్సిపాలిటీకి మహర్దశ పడుతుందని, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని" పేర్కొన్నారు. ప్రధానంగా పట్టణంలోని 1, 4, 7, 8, 9, 18, 22, 24 వార్డులలో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇల్లెందును అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పొంగులేటి హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్థానిక అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో వనపర్తి క్రీడాకారుల గుర్తింపే లక్ష్యం

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి,జనవరి9(తెలంగాణ ముచ్చట్లు):**



ఉన్నత విద్యతో పాటు క్రీడలపై విద్యార్థులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని, క్రీడల ద్వారా వనపర్తి జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. సీఎం కప్-2వ ఎడిషన్ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించి జిల్లాలోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.జనవరి 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న సీఎం కప్-2వ ఎడిషన్ క్రీడా పోటీలకు సంబంధించి శుక్రవారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. కొత్త బస్టాండ్ మీదుగా సాగిన ఈ ర్యాలీకి క్రీడాకారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో పాటు ప్రతిభావంతులను గుర్తించి జాతీయ స్థాయిలో రాణించేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చేలా పులి-జింక ఉదాహరణను వివరించారు. జింక కంటే పులి వేగం తక్కువైనా లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతోనే విజయం సాధిస్తుందని, అదే విధంగా క్రీడాకారులు గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలని సూచించారు.విద్యార్థులు ఇతర వ్యాపకాలపై కాకుండా చదువు, క్రీడలపైనే దృష్టి పెట్టాలని సూచించిన ఆయన, వనపర్తి జిల్లాకు క్రీడాపర్తిగా ప్రత్యేక గుర్తింపు ఉందని గుర్తు చేశారు. జిల్లాలోని అనేక మంది క్రీడాకారులు ఇప్పటికే జాతీయ స్థాయిలో రాణించారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాలుర పాఠశాలలోనే చదువుకొని ఇదే మైదానంలో ఫుట్‌బాల్ ఆడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఇక్కడ ఆడుతున్న క్రీడాకారులు స్ఫూర్తి పొందాలని అన్నారు.
వనపర్తి జిల్లాలో క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. సర్వే నెంబర్ 55లో 25 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ స్కూల్‌కు కేటాయింపు జరిగిందని, హాకీ గ్రీన్ టార్పెట్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2032 నాటికి భారతదేశానికి వచ్చే గోల్డ్ కప్‌లలో ఒకటి వనపర్తి జిల్లా నుంచి సాధించాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు.గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి అకాడమీల్లో చేర్పించి నైపుణ్య శిక్షణ ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఒక క్రీడా మైదానం ఏర్పాటు చేసి అవసరమైన క్రీడా సామాగ్రి అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఇప్పటి వరకు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి రూ.840 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి, డీఈఓ అబ్దుల్ ఘని, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డీఎస్పీ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాలమోని కుమార్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.







## రోడ్డు భద్రతపై కీసర పోలీసుల అవగాహన కార్యక్రమం

- రోడ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా కీసర ఎక్స్ రోడ్ వద్ద ర్యాలీ

**కీసర, జనవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్ సేఫ్టీ వారోత్సవాల సందర్భంగా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కీసర ఎక్స్ రోడ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. అంజనేయులు హాజరై ప్రజలకు, విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.రోడ్డు ప్రమాదాలను నివారించడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్న ఇన్‌స్పెక్టర్, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అనంతరం శ్రద్ధ డిగ్రీ కాలేజ్ విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 100 నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బి. నాగరాజు, సి. హరి ప్రసాద్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సత్తుపల్లి, జనవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక మండల పరిధిలోని గంగారం గ్రామంలో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు (శనివారం) ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ అంతరాయం వల్ల గంగారం, బేతుపల్లి, రామగోవింద పురం, తాళ్ళమడ గ్రామాల పరిధిలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సమయంలో గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.



## సర్పంచుకు సన్మానం చేసిన సోమేశ్వర టెక్స్టైల్ పెద్దలు

**పాలకుర్తి, ( తెలంగాణ ముచ్చట్లు**

సోమేశ్వర టెక్స్టైల్ అండ్ మ్యానుఫ్యాక్చరర్ వీవర్స్ అసోసియేషన్ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా సూరత్ కు వలస పోయి అక్కడ బతుకు వెల్లదీస్తూ తెలంగాణ లో స్థిరపడాలననే ఉద్దేశంతో కొంతమంది కార్మికులు కలిసి సోమేశ్వర టెక్స్టైల్ అండ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సంస్థవారు మైలారం గ్రామంలో కొంత భూమి తీసుకొని అక్కడ కుటీర పరిశ్రమ ఏర్పాటు కొరకు తగిన సహాయం చేయాలని నూతనంగా ఎన్నికైన మైలారం గ్రామ సర్పంచ్ చిర్ర వేణు, ఉప సర్పంచ్ రత్నాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు రత్నారెడ్డి, ఎల్లారెడ్డి, బైరి యాకయ్య లకు సంఘం అధ్యక్షులు గోరంట్ల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వన్నాల ప్రకాష్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానం చేయడం జరిగింది. అందుకు వారు స్పందించి మా సహాయం మీకు ఎల్లవేళలా ఉంటుందని హామీ ఇచ్చారు.



## పెద్దమందడి నూతన ఎస్సై జలంధర్ రెడ్డికి బీఆర్ఎస్ నాయకుల సన్మానం

**పెద్దమందడి,జనవరి9(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రానికి నూతన ఎస్సైగా పదవీ బాధ్యతలు చేపట్టిన జలంధర్ రెడ్డి ని శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఎస్సై జలంధర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల భద్రతే పోలీస్ శాఖ యొక్క ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు.గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు సేనాపతి, పురుషోత్తం రెడ్డి, హరి కుమార్ రెడ్డి, సింగిరెడ్డి కురుమూర్తి, సుర శ్రీనివాసులు, కుమ్మరి కొండన్న, కొమ్ము బ్రహ్మయ్య, కొమ్ము విష్ణు, గుడిసె మల్లేష్, సింగిరెడ్డి వెంకటస్వామి తదితరులు పాల్గొని నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.



## 25మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

- **కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పేదలకు రూ.7,65,000 మేరకు లబ్ధి**

**ఖమ్మం బ్యూరో, జనవరి 9(తెలంగాణ ముచ్చట్లు):** ప్రైవేట్ , కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య సేవలు పొందిన పేద మధ్యతరగతి ప్రజానీకాన్ని ఆదుకునేందుకు.. ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో ముఖ్యమంత్రి సహాయ నిధి( సీఎంఆర్ఎఫ్)నుంచి చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.7,65,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను విద్యానగర్ కాలనీలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో..కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, తదితరులుతో కలిసి ఎంపీ రఘురాం రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ లబ్ధి చేకూరేలా, ఆరోగ్య భరోసా లభించేలా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.






# కొండంత అండగా కల్యాణ లక్ష్మి పథకం


- పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్షా 116రూపాయల ఆర్థిక సహాయం
- పేద వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- సంక్షేమ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వొద్దు
- మీకు రావాల్సిన పథకం మీ ఇంటికే వస్తుంది

**వేలేరు,జనవరి09(తెలంగాణ ముచ్చట్లు):** నియోజకవర్గంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా ప్రజలకు సూపరిపాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలేరు మండలానికి సంబందించిన 16మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 16లక్షల 01వేల 856రూపాయల విలువ గల చెక్కులను మరియు 15మంది ముఖ్య మంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 03లక్షల 21వేల 500రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్ ల నాయకత్వంలో గ్రామాల అభివృద్ధి చెందాలని, ఆ రకంగా మనందరం కలిసి పని చేద్దాం అని తెలిపారు. పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి పథకం కొంత ఆర్థిక వెసులుబాటును కల్పిస్తున్నదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదని అన్నారు. ఇంట్లో ఆడపిల్ల పెళ్లి చేయాలి అంటే తల్లిదండ్రులు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కానీ ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక లక్ష 116 రూపాయలు ఎంతో భరోసా ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో రైతు సంక్షేమపైన, మహిళా సంక్షేమం పైన ప్రత్యేకించి పేద వర్గాల సంక్షేమం పైన దృష్టి పెట్టి కొత్తగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు. అందులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా ప్రతీ ఇంటికి 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా పేద వర్గాలకు సన్నబియ్యాన్ని పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలోనే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు. ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ గ్రామాల వారిగా సమీక్షలు చేస్తూ ఎక్కడైనా సమస్యలుంటే వాటన్నిటిని కూడా పరిష్కరిస్తూ మనం ముందుకు వెళ్తున్నాం కాబట్టే ఇవాళ మొదటి స్థానంలో నిలిచామని ఇది చాలా సంతోషకరమైన విషయం అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ఎచ్ కోమి, ఎంపీడీఓ లక్ష్మి ప్రసన్న, సర్పంచ్ బిల్లా యాదగిరి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# టైలరింగ్ శిక్షణతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- **బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు**
- **కులమతాలకు అతీతంగా 60 మంది మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ**

**ఖమ్మం బ్యూరో, జనవరి 9(తెలంగాణ ముచ్చట్లు)**

శ్రీ మాతృ మహిళా మండలి, మాతృశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని 46, 47, 48 డివిజన్లకు చెందిన సుమారు 60 మంది మహిళలకు రెండు నెలలపాటు టిఆర్ఆర్ కాంప్లెక్స్‌లో విజయవంతంగా ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగాలని బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు అన్నారు. ఈ శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం సారధి నగర్ లోని టిఆర్ఆర్ కాంప్లెక్స్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో మహిళలందరికీ ఉచిత భోజన సదుపాయంతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమానికి 48వ డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, తోట రామారావు లు ఉచితంగా కాంప్లెక్స్‌ను ఇవ్వడంతో పాటు మహిళలకు అవసరమైన అన్ని సౌకర్యాలు దగ్గరుండి ఏర్పాటు చేయడం హర్షణీయమని మాతృశ్రీ ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా తోట రామారావు, కార్పొరేటర్ తోట గోవిందమ్మ లు మాట్లాడుతూ... టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు ఇంట్లోని కుటుంబ సభ్యుల దుస్తులు కుట్టుకోవడంతో పాటు మహిళలకు సంబంధించిన జాకెట్లు, లంగాలు కుట్టడం ద్వారా కుటుంబానికి తోడ్పడగలరన్నారు. అదేవిధంగా మరింత శిక్షణ పొంది నైపుణ్యం పెంచుకుంటే ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగవచ్చని సూచించారు. ఒక మహిళ ఆర్థికంగా నిలబడితే కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటుందని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు స్వతహాగా కుట్టుకున్న జాకెట్లు వేసుకుని రావడం సంతోషంగా ఉందన్నారు. డివిజన్లోని మహిళలు కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా ఒక కుటుంబం గా ఐక్యతతో శిక్షణ పొందినందుకు అభినందనలు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయాలని, జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులు స్పందించి వారికి సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా తోట రామారావు మాట్లాడుతూ.. తమ కుమారుడు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎస్ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా పనిచేస్తున్నారని, అవసరమైన వారికి టిఆర్ఆర్ ఆర్థోపెడిక్ హాస్పిటల్‌లో మాస్టర్ ఆఫ్ సర్జన్ డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు అందిస్తామని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రీ మాతృ మహిళా మండలి, మాతృశ్రీ ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు ఎస్.కె. జాస్మిన్ మాట్లాడుతూ.. రెండు నెలల పాటు 60 మంది మహిళలు ఉచితంగా టైలరింగ్ నేర్చుకున్నారని, ఈ నైపుణ్యంతో వారి కుటుంబాలను ఆర్థికంగా బలపరుచుకోవాలని తెలిపారు. శిక్షణ పొందిన మహిళలు ఉద్యోగం కావాలనుకుంటే తమను సంప్రదిస్తే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలు మాట్లాడుతూ.. ఎంతోకాలంగా ఉపాధికి తగిన శిక్షణ లేక ఇబ్బందులు పడుతున్న మాకు మాతృశ్రీ ఫౌండేషన్ ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడిందని, ఇంటి వద్దే ఉపాధి పొందే అవకాశం కలిగిందని తెలిపారు. ఇందుకు సహకరించిన బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు, మాతృశ్రీ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. 46వ డివిజన్ నాయకులు కనకం భద్రయ్య, బొల్లెపల్లి విజయ్, ఆకుల సత్యం, జి. కృష్ణ నాయక్, తోట రమేష్ కుమార్, మాటేటి కిరణ్ లు మాట్లాడుతూ... తోట రామారావు కుటుంబం సర్వీస్ ఓరియెంటెడ్‌గా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, వరదల సమయంలోనూ, వేసవి సమయాలలో, ఆపద సమయాలలో బాధిత కుటుంబాలకు భోజనం, వైద్యం, ఆర్థిక సహాయాలు అందించిన కుటుంబమని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఫౌండేషన్ సూపర్వైజర్ ఎండి. చాందిని, టైలరింగ్ టీచర్ ఎస్.కె. అరీషా, టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.





# ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్‌ను కలసిన, టిడబ్ల్యూజేఎఫ్ నేతలు

- **జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని జిల్లా అధ్యక్షులు సంతోష్ చక్రవర్తి ద్వారా తెలుసుకున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి**

**ఖమ్మం బ్యూరో, జనవరి 09(తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుల అంశంలో నెలకొన్న అనిశ్చితిపై న్యాయ సహకారం అందించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్

(టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843) జిల్లా కమిటీ బృందం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.రాజగోపాల్ ను ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాబోయే సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి. రాజగోపాల్ కు ముందస్తు శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఈ భేటీలో జిల్లా అధ్యక్షులు టి. సంతోష్ చక్రవర్తి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకు మంజూరైన ఇండ్ల స్థలాల విషయంలో ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర అనిశ్చితిని సృష్టిస్తున్నాయని జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లో న్యాయ నిపుణులు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశంపై చేసిన సూచనలు, సుప్రీం కోర్టు తీర్పు ఆధారంగా ఉన్న న్యాయపరమైన అంశాలను వివరించి, జర్నలిస్టులకు చట్టపరమైన పరిరక్షణ కల్పించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

దీనికి స్పందించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్, సుప్రీంకోర్టు తీర్పులు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తిస్తాయని స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు సమర్పించిన వినతిపత్రంలోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, చట్ట పరిధిలో సాధ్యమైన న్యాయ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలబడి వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు వందనపు సామ్రాట్ గుప్తా, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అంతోటి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస రావు, కుంభం రవి కుమార్, కాసోజు శ్రీధర్, సుధాగాని కరుణాకర్, కప్పల మధు గౌడ్, సాపవత్ నాగరాజు, చిన్నంశెట్టి రాంబాబు, అమరబోయిన ఉపేందర్, కందరపోయిన నాగకృష్ణ, వంగ పుంగమ గౌడ్, కొండల్, ఎలుగోటి వెంకట్, కరాటే వేణు, నాయిని స్వాతి, తుమ్మలపల్లి శ్రీనివాస్, షేక్ సోందుమియా, మల్లెల శిల్ప, రమేష్, గంటేల కుమార్, మందడపు మనోహర్, సురేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# లంకపల్లిలో ఎలుకల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం

- **సకాలంలో స్పందించిన 108 సిబ్బంది.**
- **ప్రాణాపాయం నుంచి బయటపడిన బాధితుడు**

**సత్తుపల్లి, జనవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

పెనుబల్లి మండలం లంకపల్లి గ్రామానికి చెందిన పర్సా మారేష్ (30) మద్యానికి బానిసై, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన స్థానికులు వెంటనే సత్తుపల్లి 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు.
సమాచారం అందుకున్న సత్తుపల్లి 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, పైలెట్ రాధాకృష్ణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మూడు జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ ఆదేశాల మేరకు గోల్డెన్ అవర్‌లో బాధితుడికి సెలైన్, ఇంజక్షన్లు, ఆక్సిజన్ అందిస్తూ ప్రాథమిక చికిత్స చేసి, పెనుబల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.
సకాలంలో స్పందించి ప్రాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నాలకు సత్తుపల్లి 108 సిబ్బందిని జిల్లా 108 మేనేజర్ ఆవులూరి దుర్గాప్రసాద్, మూడు జిల్లాలను నిరంతరం పర్యవేక్షిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్‌తో పాటు లంకపల్లి గ్రామస్తులు అభినందించారు.



# అనునిత్యం ప్రజా శ్రేయస్సే మా ధ్యేయం నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్లాపూర్ డివిజన్ లో ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రజల మద్దతుతోనే ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.





# ప్రపంచ స్థాయి విద్యా లక్ష్యంతో భారత్ ముందంజలో బిట్స్ పిలానీ


- **తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ**

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలను సాధించే దిశగా భారత్ చేస్తున్న ప్రయాణంలో బిట్స్ పిలానీ అగ్రగామిగా నిలుస్తోందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బిట్స్ పిలానీకి చెందిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం 'బిట్సా గ్లోబల్ మీట్ - 2026 (బిజిఎం 26)' ఆరో ఎడిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీ క్యాంపస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సును గవర్నర్ అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎఫ్ సి ఏ) మరియు కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ (ఐఏఎస్), బీజీఎం 2026 ఛైర్‌పర్సన్ అనిత సాకూరు, బిట్స్ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. రామగోపాల్ రావు, ఇన్వెంటస్ క్యాపిటల్ పార్టనర్స్ ఎంజెల్ ఇన్వెస్టర్ కన్వల్ రేఖి, బీజీఎం 2026 సీఈఓ మయూర్ పట్నాలా తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, బిట్స్ పిలానీ కేవలం విద్యా ప్రతిభకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలు, నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు, భయంలేని జిజ్ఞాసను తరతరాలుగా పెంపొందిస్తూ వస్తోందని ప్రశంసించారు. నేటి విద్యా రంగం కృత్రిమ మేధస్సు (ఏ I), డేటా సైన్స్, ఆటోమేషన్, డిజిటల్ మార్పులతో కీలక మలుపు తిరుగుతోందని పేర్కొన్నారు. ఏ I ఇక భవిష్యత్తు కల కాదని, ఇది ఇప్పటికే విద్య, పాలన, ఆరోగ్య రంగం, పరిశ్రమలను ప్రభావితం చేస్తోందన్నారు.
ఆI డేటాను విశ్లేషించగలదని, నిర్ణయాలు తీసుకోగలదని, అయితే మానవ విచక్షణ, నైతికత, సృజనాత్మకత, కరుణకు అది ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. విద్య లక్ష్యం యంత్రాలతో పోటీ పడటం కాదని, సమాజ హితానికి సాంకేతికతను దారి చూపే మానవ విలువలను బలోపేతం చేయడమేనని అన్నారు. ఈ దిశగా బిట్స్ పిలానీ స్వయం



ప్రతిపత్తి, అనువైన పాఠ్య ప్రణాళికలు, అంతరశాఖీయ అధ్యయనం, ప్రాయోగిక విద్య ద్వారా ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాంకేతిక వ్యవస్థతో అనుసంధానమై ఆధునిక పదార్థాలు, బయోటెక్నాలజీ, వాతావరణ పరిష్కారాలు, రోబోటిక్స్, AI రంగాల్లో బిట్స్ విశేష పురోగతి సాధిస్తోందన్నారు. ఇలాంటి సంస్థలు భారత్‌ను కేవలం సాంకేతిక వినియోగదారుడిగా కాకుండా ఆవిష్కరణల సృష్టికర్తగా నిలబెడుతున్నాయని అన్నారు.పూర్వ విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, వారి విజయాలే బిట్స్ పిలానీ వారసత్వానికి ప్రతీకలని అన్నారు. జాన్ ఎఫ్. కెన్నెడీ మాటలను ఉటంకిస్తూ, విశ్వవిద్యాలయాలకు పూర్వ విద్యార్థుల సంఘాలే ప్రాణవాయువని, వారి మార్గదర్శనం, దానధర్మాలు సంస్థ అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచి, జాతీయ స్వయం సమృద్ధి సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.దాన కిశోర్ మాట్లాడుతూ సాంకేతికత, నాణ్యమైన విద్య ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వర్క్‌ఫోర్స్ డెవలప్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, నిరంతర అభ్యాసంలో బిట్స్ వంటి సంస్థలు జాతీయ భాగస్వాములుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.
బీజీఎం 2026 ఛైర్‌పర్సన్ అనిత సాకూరు మాట్లాడుతూ, ఈ సదస్సు వివిధ తరాల మధ్య సహకారానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని అన్నారు. తొలి రోజు ముగింపులో సంప్రదాయ ఖవ్వాలీ ప్రదర్శనతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు.





# ముగ్గుల పోటీలను ప్రారంభించిన డా. సాయి రాధా మనోహర్

**మేడ్చల్ మల్కాజ్గిరి, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా ఐడీఓసీ షామీర్పేట్ ప్రాంగణంలో టీజీవోస్ ఎంఎం జిల్లా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఉత్సాహభరితంగా తమ సృజనాత్మకతను ముగ్గుల రూపంలో ప్రదర్శించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సాయి రాధా మనోహర్ (జిల్లా కలెక్టర్ సతీమణి) ప్రారంభించారు. మహిళా సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆమె అన్నారు.కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, ఎస్సీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి. వినోద్ కుమార్, డీఈఓ విజయకుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీ, లా ఆఫీసర్ చంద్రావతి పాల్గొని పోటీలను ప్రారంభించి, విజేతలకు బహుమతులు ప్రకటించారు.
అనంతరం డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టీజీవోస్ జనరల్ సెక్రటరీ కురుమూర్తి, జాయింట్ సెక్రటరీ ఆనంద్‌తో పాటు ఇతర టీజీవోస్ ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ముగ్గుల పోటీలతో ఐడీఓసీ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకోగా, ఉద్యోగస్తుల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# సంక్రాంతి ముగ్గులు సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి

- **మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి**



**ఏ ఎస్ రావు నగర్, జనవరి (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి ముగ్గులు మన తెలుగు సాంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తాయని మాజీ కార్పొరేటర్ పావని మణిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ ఉత్సవాలలో భాగంగా కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం సీనియర్ సిటిజన్ ఆవరణలో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమలానగర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ బృందంతో కలిసి ముగ్గుల పోటీల్లో విజేతలైన వారికి మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రకటించి అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ పావని మణిపాల్ రెడ్డి కన్సొలేషన్ బహుమతులు అందించి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ తెలుగింటి ఆడపడుచులకు ఎంతో ప్రత్యేకమైనదని, తెలుగు రాష్ట్రాల్లో ఈ పండుగను సంప్రదాయబద్ధంగా, ఉత్సాహంగా జరుపుకుంటారని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా సుమారు పదిహేను రోజుల పాటు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేస్తూ తమ ఆనందం, సంతోషం, భావోద్వేగాలను వ్యక్తపరచడం మన పూర్వీకుల నుంచి వచ్చిన గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు చేరుతాయని ఆమె అన్నారు.



# విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలి

- **మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్**

**పెద్దమందడి,జనవరి9(తెలంగాణ ముచ్చట్లు):**



విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తూ ముందుకు సాగాలని పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మణిగిల్ల గ్రామ హైస్కూల్ మరియు ప్రైమరీ స్కూల్‌లలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఫుడ్ ఫెస్టివల్, పతంగుల కాంపిటీషన్ల కార్యక్రమానికి ఆయన హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గెలుపు-ఓటములు సహజమని, ఓటమిని నిరాశగా కాకుండా అనుభవంగా తీసుకొని మరింత మెరుగ్గా రాణించాలన్నారు.విద్యార్థులు మంచి క్రమశిక్షణతో పాటు తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మాటను పాటిస్తూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని సూచించారు. చదువుతో పాటు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల ప్రతిభ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు.విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తే ఉజ్వల భవిష్యత్తు తప్పకుండా ఉంటుందని, వారి అభివృద్ధికి అవసరమైన ఎలాంటి సహాయ సహకారాలైనా గ్రామపంచాయతీ తరపున అందిస్తామని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మద్దిరాల నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ గణేష్, ఎస్. రాములు, మద్దిరాల రామకృష్ణారెడ్డి, పోతుల రామిరెడ్డి, ప్రతాపరెడ్డి, గొంది రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.అలాగే హైస్కూల్ హెడ్మాస్టర్ అడ్డాకుల వెంకటేష్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం నసీమ్‌తో పాటు ఉపాధ్యాయులు జానయ్య, వీ. రాములు, ఎస్. రాములు, రఫీ, రాధిక, లావణ్య, ముప్పిరి మధుసూదన్, ముపిరి మన్యం, ముప్పూరి కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఐక్యంగా పనిచేస్తేనే కాంగ్రెస్ విజయం

- పాత–కొత్త తేడా లేకుండా పార్టీ పటిష్టతకు కృషి చేయాలి
- వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి,జనవరి9(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీలో పాత,కొత్త అనే తేడా లేకుండా అందరూ కలిసిపోయి ఐక్యంగా పనిచేస్తేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి పట్టణంలోని ఆర్‌జీ గార్డెన్స్‌లో నిర్వహించిన వనపర్తి మున్సిపాలిటీ 33 వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.రానున్న వనపర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండానే ఎజెండాగా భావించి ప్రతి కార్యకర్త పనిచేయాలని వారు సూచించారు. ఫామ్‌హౌస్ పాలనను దూరం చేసేందుకు వనపర్తి పట్టణ ప్రజలు ఐక్యంగా పనిచేశారని, బీఆర్ఎస్ అరాచక పాలనకు చరమగీతం




పాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన తర్వాత ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు.ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థులే ఎక్కువ చోట్ల విజయం సాధించారని, కొన్నిచోట్ల ఫలితాలపై నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో పాత-కొత్త అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహిళా సమాఖ్యలు, మహిళల భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్సుల కొనుగోలు వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు.

వనపర్తి పట్టణంలోని 33 వార్డులకు సంబంధించి ఇప్పటివరకు దాదాపు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని, ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్ల కాలంలో వనపర్తి నియోజకవర్గంలో సుమారు రూ.2,000 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ఇందులో వనపర్తి పట్టణానికి మాత్రమే రూ.807 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బీ-ఫామ్‌తో ఎవరికి టికెట్ ఇచ్చినా వారి గెలుపు కోసం అందరూ సమిష్టిగా పనిచేయాలన్నారు. రిజర్వేషన్ల ప్రకారం, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులకే టికెట్లు ఇవ్వబడతాయని తెలిపారు. యువజన కాంగ్రెస్ నాయకులకు కూడా అవకాశం ఉన్నచోట ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీలో ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి సమానులేనని,వర్గపోరాటాలతో పార్టీకి నష్టం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఖాయం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యులు శంకరప్రసాద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, శ్రీలత రెడ్డి, తిరుపతయ్య గౌడ్, బి. కృష్ణ, పుట్టపాకుల మహేష్, ధనలక్ష్మి, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్–మల్కాజిగిరి, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో డిఆర్ఓ హరిప్రియతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ వేడుకలకు కలెక్టరేట్ ప్రాంగణంలో రంగురంగుల పూలతో వేదికను ఆకర్షణీయంగా ముస్తాబు చేయాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు.






విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు సౌకర్యంగా వేడుకలను వీక్షించేలా షామియానాలు, కుర్చీలు, తాగునీటి వసతులు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు.జాతీయ జెండా ఆవిష్కరణ, గౌరవ వందనం, ప్రసంగ కార్యక్రమాలకు మైక్, పీఏ సిస్టం సక్రమంగా ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు. వేడుకలు పూర్తయ్యే వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్తు శాఖను ఆదేశించారు.కలెక్టరేట్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లు, భవనాల శాఖ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివరావు, సీపీఓ శేఖర్, ఉద్యాన శాఖాధికారి శ్రీధర్, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు వినోద్ కుమార్, ఝాన్సీరాణి, సివిల్ సప్లై డీఎం సుగుణ బాయి, జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి, పోలీస్, ఫైర్ శాఖల అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల ఐఓటి శిక్షణా శిబిరం ముగింపు

- ఐఓటి అనువర్తనాలపై లోతైన అవగాహన కల్పించిన నిపుణులు.

**సత్తుపల్లి, జనవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):** మండల పరిధిలోని బి గంగారం గ్రామంలో స్వయంప్రతిపత్తి కలిగిన సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో రియల్ టైం ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ అనువర్తనాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణా శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థినీ, విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని విభాగం ఆధ్వర్యంలో, ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్స్ సహకారంతో నిర్వహించారు. ఈ శిబిరానికి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం జగిత్యాల ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన బి.ప్రభాకర్, హైదరాబాద్‌కు చెందిన మాక్స్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ యండి.జావీద్ ముఖ్య వనరులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ,






రియల్ టైం ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ అనువర్తనాలపై అవగాహన పొందడం ద్వారా విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలకు సిద్ధం కావడంతో పాటు, ప్రాజెక్టుల రూపకల్పనలో నైపుణ్యం సాధించగలరని తెలిపారు. ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత అనేక రంగాల్లో వేగంగా విస్తరిస్తోందని, విద్యార్థులు చదువుతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలు కూడా అలవరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఉద్యోగ రంగంలో నిలదొక్కుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేషారత్నకుమారి మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన ప్రత్యేక నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా శిబిరం నిర్వహించామని తెలిపారు. రియల్ టైం అనువర్తనాలపై అవగాహన పెరిగితే ఉద్యోగావకాశాలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సాయిస్ఫూర్తి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన విద్యా సంస్థ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా పాల్గొని విద్యార్థులను అభినందించారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్ షేక్ యాకూబ్, పరీక్షల నియంత్రణాధికారి, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి పి.శేఖర్ బాబు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జన కళ్యాణ సమాఖ్య సహకారంతో జిల్లా ఆసుపత్రికి కీలక వైద్య పరికరాల

**మేడ్చల్ మల్కాజ్గిరి , జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు)**

మల్కాజ్గిరి జిల్లా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జన కళ్యాణ సమాఖ్య (జె.కె.ఎస్) మరియు మిత్సుబిషి ఎలివేటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారి సి.ఎస్.ఆర్ నిధుల సహాయంతో ఆధునాతన సౌకర్యాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ పరికరాలను అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిత్సుబిషి సంస్థ నుంచి రీజినల్ హెడ్ ముహిదీన్ అబ్దుల్





ఖాదర్, అడ్వైజరీ మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్‌తో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. సునీత, జి.జి.హెచ్ సూపరింటెండెంట్ డా. రాధ, ఎ.ఓ డా. సంగీత్, ఆర్.ఎం.ఓ డా. శివకిరణ్ మరియు మెడికల్ సిబ్బంది హాజరయ్యారు.అలాగే జన కళ్యాణ సమాఖ్య జె.కె.ఎస్ నుండి సీఈఓ నిధిల్ వర్గీస్‌తో పాటు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పరికరాల ద్వారా ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు మరింత సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని వైద్యులు తెలిపారు.




# మర్లపాడు వద్ద రోడ్డు ప్రమాదం

- అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన 108 సిబ్బంది.

**సత్తుపల్లి, జనవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొమ్మినేపల్లి నాగరాజు (36) మర్లపాడు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదుట రోడ్డుపై వెళ్తుండగా స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగరాజు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందగానే వేంసూరు మండల కేంద్రంలో సిద్ధంగా ఉన్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ తేనేటి మురళీకృష్ణ, పైలెట్ పెద్ద గౌడ ఏకాంత్ నాగరాజుకు అక్కడికక్కడే సీపీఆర్ నిర్వహించి, ఆక్సిజన్ అందించి, గాయాలకు కట్లు కట్టారు. అనంతరం ప్రథమ చికిత్స అందజేస్తూ సత్తుపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గోల్డెన్ అవర్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రోగ్రాం మేనేజర్ షేక్ నజీరుద్దీన్ ఆదేశాల మేరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# కుషాయిగూడలో రోడ్డు ప్రమాదం చికిత్స పొందుతూ యువకుడు మృతి

**కుషాయిగూడ , జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎం. గంగయ్య శుక్రవారం ఉదయం 09:30 గంటలకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన కుమారుడు ఎం. శేఖర్ (23), వృత్తిరీత్యా కార్ మెకానిక్. గత సంవత్సరం కాలంగా హైదరాబాద్ లోని కట్టమైసమ్మ టెంపుల్ కాప్రా ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు.గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో శేఖర్ తన పల్సర్ ద్విచక్ర వాహనంపై నేతాజీ నగర్ ఎక్స్ రోడ్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో, కట్టమైసమ్మ టెంపుల్ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన అపాచీ ద్విచక్ర వాహనం (నంబర్: TS 08 FH 8816) అజాగ్రత్తగా, అతివే



గంగా నడుపుతూ శేఖర్ వాహనాన్ని ఢీకొట్టింది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు శేఖర్ యజమాని రాఘవుల శివకు సమాచారం అందించగా, ఆయన వెంటనే ఘటనాస్థలికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా శేఖర్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం శేఖర్ తల్లిదండ్రులకు తెలియజేయగా, వారు ఆసుపత్రికి చేరుకున్నారు.చికిత్స పొందుతున్న శేఖర్ 09.01.2026 శుక్రవారం రోజు సాయంత్రం 04:18 గంటలకు మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్లు ధృవీకరించారు.ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# హైదరాబాద్‌లో ఏఐపిసి ఎగ్జిక్యూటివ్ సమావేశం

- పార్టీ బలోపేతానికి ఏఐపిసి కీలకపాత్ర
- అఖిల భారత ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి

**వనపర్తి, జనవరి 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి) ఎగ్జిక్యూటివ్ సమావేశం హైదరాబాద్ తుక్కుగూడలోని టిపిఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర ఏఐపిసి అధ్యక్షులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏఐపిసి చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ భారతదేశంలోనే అతి పెద్ద మరియు అత్యంత ప్రభావవంతమైన రాజకీయ పార్టీలలో ఒకటని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ నేటికీ దేశ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా కొనసాగుతోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీలో భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని, రాష్ట్రాలలో ఏఐపిసి విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నాయకులకు సూచించారు. పార్టీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రొఫెషనల్స్ పాత్ర అత్యంత కీలకమని, సమాజంలోని వివిధ వర్గాల మేధావులను కాంగ్రెస్ పార్టీలో చురుకుగా భాగస్వాముల్ని చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంస్థాగతంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఏఐపిసి అధ్యక్షులు, ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం విజయవంతంగా నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు.



# వీధి కుక్కలపై ఫిర్యాదులు శాంతిభద్రతల పరిధిలోవే

(మొదటి పేజీ తరువాయి)

వీధి కుక్కల సమస్య నిరోధానికి సుప్రీం కోర్టు సూచించిన కఠిన చర్యలను సడలించాలని కోరుతూ శునక ప్రేమికులు, న్యాయస్థానం ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలని మరికొందరు చేసిన అభ్యర్థనలపై శుక్రవారం కూడా విచారణ కొనసాగింది. ఎక్కడో ఏదో తప్పు జరిగిందనే వ్యక్తిగత కేసులపై తాము దృష్టిసారించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. శునకాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని మరో న్యాయవాది తెలుపగా...ప్రస్తుత కేసు వీధి శునకాల సమస్యకు సంబంధించింది మాత్రమేనని గుర్తు చేసింది. ఈ నెల 13న విచారణ తిరిగి కొనసాగనుంది. వీధి కుక్కలు అన్నింటినీ ఒకే గాటన కట్ట వద్దని, వాటిలో మంచివీ ఉంటాయని బాలీవుడ్ అలనాటి నటి షర్మిలా ఠాగూర్ సుప్రీంకోర్టుకు తెలిపారు. దాడిచేసే కుక్కలను ఒక ప్రత్యేక కమిటీ ద్వారా గుర్తించాలని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. ఈ వాదన వాస్తవానికి దూరంగా ఉందంటూ అత్యున్నత న్యాయస్థానం ఆక్షేపించింది. కలర్ కోడింగ్ పట్టీలు అమర్చడం మనకు సాధ్యమవుతుందా? వాటిని అనుసరిస్తున్న దేశాల జనాభా ఎంత? అని ప్రశ్నించింది.

# భాజపా డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

వారి దృష్టిలో వీరంతా కేవలం గణాంకాలు మాత్రమే. అభివృద్ధి పేరుతో దోపిడీ వ్యవస్థ నడుస్తోంది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉత్తరాఖండ్ అంకితా భండారీ కేసులో భాజపాకు చెందిన ఏ ముఖ్య వ్యక్తిని రక్షిస్తున్నారు? అందరికీ సమన్యాయం ఎప్పుడు దక్కుతుంది? అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ రేప్ కేసులోనూ నిందితులను కాపాడుతున్నారు. ఇండౌర్‌లో కలుషిత నీరు తాగి మరణించడం.. గుజరాత్, హరియాణా, దిల్లీలో కలుషిత నీరు, గాలితో చనిపోయిన ఘటనలతో అందరిలోనూ వ్యాధుల భయం ఉంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీజీ కేవలం



యాయి. దగ్గు మందు తాగి చిన్నారులు మరణించారు. ఆస్పత్రుల్లో ఎలుకలు కొరికి నవజాత శిశువులు చనిపోయారు. ఇన్ని జరిగినా భాజపా ప్రభుత్వం ప్రతీసారి ఒకటే చేస్తుంది. ఫొటోలకు ఫోజులు, ట్వీట్లు, సంతాపాలు, పరిహారాలు ఇచ్చి చేతులు దులిపేసుకోవడం'' అని రాహుల్ ధ్వజమెత్తారు.



# చైనా కంపెనీలపై ఆంక్షల సడలింపుపై కేంద్రంలో కసరత్తు

భారత్‌లో చైనా కంపెనీల కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వం గేట్లు బార్లా తెరవనుందా? గల్వాన్ ఘటన అనంతరం చైనా సంస్థలపై విధించిన నియంత్రణల ఎత్తివేతకు సిద్ధమవుతోందా? దేశంలో వివిధ రంగాల ప్రాజెక్టులకు తీవ్ర ఇబ్బందిగా మారిన నేపథ్యంలో ఈ విషయంలో తర్జనభర్జన పడుతోందా?.. కేంద్ర ఆర్థికశాఖలోని సంబంధిత అధికారవర్గాలు, రాయిటర్స్ ప్రచురించిన కథ నం ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నా యి. అయితే ఇది ప్రతిపాదనల దశలోనే ఉందని, ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొంటున్నాయి. 2020లో గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య ఘర్షణలు, అనంతర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. భారత్‌లో చైనా కంపెనీల కార్యకలాపాలపై కేంద్రం పలు నియంత్రణలు విధించింది. భారత్‌లోని వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల టెండర్లలో ఏవైనా చైనా కంపెనీలు పాల్గొనాలంటే.. భారత ప్రభుత్వం వద్ద ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకుని, రాజకీయ, భద్రతాపరమైన క్లియరెన్సులు తీసుకోవాలి. భారత ప్రభుత్వం వద్ద చైనా ప్రభుత్వ రంగ సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకునే పరిస్థితి ఉండదు. అంటే ఆ సంస్థలు భారత్‌లో ప్రాజెక్టులు చేపట్టడానికి వీలు ఉండదు. దీనితో లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులపై ప్రభావం పడినట్టు అంచనా. ఉదాహరణకు భారత్‌లో రూ.2 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుకు బిడ్ వేసిన చైనా ప్రభుత్వ రైల్, రోడ్ కార్పొరేషన్ సంస్థ ఆ పనులను చేపట్టలేని పరిస్థితి నెలకొందని ప్రభుత్వ వర్గా లు తెలిపాయి. పలు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకూ ఇలాంటి సమస్య ఉందని పేర్కొన్నా యి. ఈ క్రమంలో చైనా కంపెనీలపై నియంత్రణలు సడలించాలని విజ్ఞప్తులు వచ్చాయని వెల్లడించాయి. దానికితోడు ప్రస్తుతం భారత్, చైనా మధ్య సరిహద్దు ఉద్రిక్తలు చల్లారడం, దౌత్యపరమైన సంబంధాలు పూర్వస్థితికి వస్తుండటంతో.. చైనా ప్రభుత్వ రంగ సంస్థలపై నియంత్రణలను తొలగించే దిశగా కసరత్తు జరుగుతున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- పెబ్బేరు మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి
- ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**పెబ్బేరు,జనవరి9(తెలంగాణ ముచ్చట్లు):** నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, నేడు ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందుతున్నదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు.శుక్రవారం పెబ్బేరు పట్టణంలోని ఎస్ఎల్‌వీ గార్డెన్స్‌లో నిర్వహించిన పెబ్బేరు మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేన రెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ విజయపతాకాన్ని ఎగురవేయాలని




పిలుపునిచ్చారు.చిన్నచిన్న మనస్పర్ధలతో విడివిడిగా ముందుకెళ్తే పార్టీకి నష్టం వాటిల్లుతుందని, అందరూ ఏకమై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు గెలిస్తే మనం కిటికీల్లోంచి చూడాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తూ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.పెబ్బేరు మండలం ఆసియా ఖండంలోనే పేరెన్నిక గన్న మండలమని, కోట్ల రూపాయల ఆదాయం వచ్చే సంత ఉన్నదని గుర్తు చేశారు.ఆ సంత




భూమిని కబ్జా చేయాలని ప్రయత్నించిన కొందరి ప్రయత్నాలను తిప్పికొట్టి, కోట్ల రూపాయల విలువైన సంత భూమిని కాపాడుకునేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో పెబ్బేరు మున్సిపాలిటీలోని 12 వార్డులన్నింటిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయకేతనం ఎగురవేయాలని, ఇందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, ధనలక్ష్మి, పెబ్బేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్రాములు యాదవ్, దయాకర్ రెడ్డి, రాజశేఖర్, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, సత్యం, పెబ్బేరు మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యాసంస్థలో సంక్రాంతి సంబరాలు

- రామాయణం ప్రదర్శనతో ఆధ్యాత్మిక వాతావరణం

**ఏ ఎస్ రావు నగర్, జనవరి 09 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీ చైతన్య విద్యాసంస్థలో నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. ఈ సంబరాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను తీర్చి పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు.భోగి మంటలు, హరిదాసుల సంకీర్తనలు, గాలిపటాల ఎగురవేతతో స్కూల్ ప్రాంగణం పండుగ సందడితో కళకళలాడింది. ముఖ్యంగా చిన్నారులు ప్రదర్శించిన రామాయణం నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.సీతారాముల కళ్యాణం, వాలి వధ, యుద్ధకాండ, రావణాసుర వధ, శ్రీ సీతారాముల పట్టాభిషేకం వంటి ఘట్టాలను విద్యార్థులు



అద్భుతంగా ప్రదర్శించారు. రాముడిగా ధీరన్, సీతమ్మ పాత్రలో తన్విక, లక్ష్మణుడిగా చాణిక్య, భరతుడిగా ప్రణవ్, ఆంజనేయుడిగా నిహాల్, రావణాసురుడిగా పలుగుల అద్విత్, దశరథుడిగా ఇషాన్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ పాత్రల్లో చిన్నారుల వేషధారణలు, నటన ప్రేక్షకుల మన్ననలు పొందాయి.ఈ రామాయణం ప్రదర్శనతో స్కూల్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను నేర్పుతాయని తల్లిదండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస ప్రభు, ఉపాధ్యాయులు సంధ్యారాణి, సత్యవాణి, అనుప్రిత, శ్రీదేవి, గౌతమి, వరలక్ష్మి, పరిపూర్ణ, జ్యోతి, శిరీష, హిమబిందు, పర్వీన్‌తో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఐఈడీ ముప్పుకు చెక్.. నేషనల్ డిజిటల్ ఐఈడీ డేటా ప్లాట్‌ఫాం ప్రారంభం

ఉగ్రవాదులు, తీవ్రవాదులు విసురుతున్న అత్యాధునిక పేలుడు పదార్థాల (ఐఈడీ) ముప్పును దీటుగా ఎదుర్కొనేందుకు ఉద్దేశించిన నేషనల్ డిజిటల్ ఐఈడీ డేటా ప్లాట్‌ఫాంను కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ప్రారంభించారు. ఉగ్రవాదం బారినుంచి దేశాన్ని కాపాడే అత్యాధునిక రక్షణ ఛత్రంగా దీన్ని అభివర్ణించారు. ఈ నేషనల్ ఐఈడీ డేటా మేనేజ్‌మెంట్ సిస్టం (ఎన్ఐడీఎంఎస్)ను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఉగ్రవాద వ్యతిరేక కమెండో దళం ఎన్ఎస్‌జీ అభివృద్ధి చేసింది.

ఇందుకు గాంధీనగర్‌లోని రాష్ట్రీయ రక్షా యూనివర్సిటీ, ఐఐటీ ఢిల్లీ, జాతీయ దర్యాప్తు సంస్థ, ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్



సెంటర్ సాయం అందించాయి.పలు రకాల బాంబులను క్షుణ్నంగా అధ్యయనం చేసే అత్యాధునిక కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ పరికరాలు ఎన్ఐడీఎంఎస్ సొంతం. దీన్ని 2000లో ఏర్పాటైన ఎన్ఎస్‌జీ తాలూకు నేషనల్ బాంబ్ డేటా సెంటర్‌కు ఒకరకంగా అత్యాధునిక వెర్షన్‌గా చెబుతున్నారు. దేశ అంతర్గత భద్రతకు అత్యంత ముప్పుగా పరిణమించిన ఐఈడీల బారిన పడి ఏటా వేలాది మంది పౌరులు, భద్రతా సిబ్బంది మరణిస్తున్నారు.

ఎన్ఐడీఎంఎస్‌ను వెలకట్టలేని జాతీయ ఆస్తిగా అమిత్ షా అభివర్ణించారు. దేశంలో పలుచోట్ల ఉగ్రవాదులు జరుపుతున్న బాంబు పేలుళ్లను ఇది సమర్థంగా అడ్డుకుంటుందని తెలిపారు. బాంబులు, బాంబు దాడులకు సంబంధించిన కీలకమైన, సమగ్రమైన డేటాను పోలీసు, భద్రతా సిబ్బంది, ఎన్ఐఏ వంటి దర్యాప్తు సంస్థలు, ఉగ్రవాద వ్యతిరేక దళాలకు ఇది అందుబాటులోకి తెస్తుంది. అంతేగాక దర్యాప్తులను వేగవంతం చేయడంలో, నాణ్యతతో కూడిన ఫోరెన్సిక్ సాక్ష్యాల సేకరణలో సాయపడుతుంది''అని మంత్రి వివరించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో కొత్తగా ఏర్పాటవుతున్న ఎన్ఎస్‌జీ స్థావరం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే దేశంలో ఏ ప్రాంతానికైనా ఎన్ఎస్‌జీ కమెండోలు గంట నుంచి గంటన్నర వ్యవధిలోనే చేరుకునే వీలుంటుందని తెలిపారు. ఐఈడీలు, ఇతర పేలుడు పదార్థాలకు సంబంధించిన సమాచారాన్ని అప్పటికప్పుడు చేరవేసే వేదికగా ఎన్ఐడీఎంఎస్‌ను ఎన్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్ భృగు శ్రీనివాసన్ అభివర్ణించారు.

# 500 అడుగుల లోయలో పడిన బస్సు.. 14 మంది మృతి

హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాద ఘటన చోటుచేసుకుంది. హిమాచల్‌లోని సిర్మౌర్ జిల్లాలో ఓ ప్రైవేట్ బస్సు లోయలో పడి దాదాపు 14 మంది మృతి చెందారు. అనేక మంది గాయపడ్డారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

వివరాల ప్రకారం.. హిమాచల్‌లోని సిమ్లా నుంచి కుప్వికి వెళ్తున్న బస్సు హరిపుర్‌ధర్ దగ్గర అదుపుతప్పి 500 అడుగుల లోయలో పడింది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను బస్సు లోపల నుంచి బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న సహాయక సిబ్బంది గాయపడ్డ వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.





తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చలికాలం ఈ కూరగాయల్ని తినొచ్చా?



చలికాలంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సీజన్‌లో శరీరం నెమ్మదిగా పనిచేస్తుంది. అనారోగ్య సమస్యలు త్వరగా దరిచేరుతాయి. కాబట్టి, మనం తినే కూరగాయల ఎంపిక చాలా ముఖ్యం. చలికాలంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ సీజన్‌లో శరీరం నెమ్మదిగా పనిచేస్తుంది. అనారోగ్య సమస్యలు త్వరగా దరిచేరుతాయి. కాబట్టి, మనం తినే కూరగాయల ఎంపిక చాలా ముఖ్యం. కొన్ని కూరగాయలు శరీరానికి వేడిని అందించి రోగనిరోధక శక్తిని పెంచితే, మరికొన్ని కఫం, జలుబు వంటి సమస్యలను పెంచుతాయి. చలికాలంలో ఏవి అనారోగ్య సమస్యలను తగ్గిస్తాయి. వేటిని తీసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. చలికాలంలో ఏ కూరగాయలు తినాలి, ఏవి తినకూడదు. చలికాలంలో ఆకుకూరలు తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. పాలకూర, మెంతికూర, బచ్చలికూర, చుక్కకూర వంటి ఆకుకూరల్లో విటమిన్ ఎ, సి, కె, ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ముఖ్యంగా పాలకూరలో ఉండే యాంటీఆక్సిడెంట్స్ శరీరాన్ని లోపల నుంచి వేడిగా ఉంచడంలో సహాయపడతాయి. క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి వంటి రూట్ వెజిటెబుల్స్ చలికాలానికి సరైన ఎంపిక అని చెప్పవచ్చు. ఇవి భూమిలో పెరుగుతాయి కాబట్టి సహజంగానే వేడి స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఈ కూరగాయలు శరీరానికి లోపల నుంచి వేడిని అందిస్తాయి. క్యారెట్, బీట్‌రూట్‌లో ఉండే బీటాకెరోటిన్, ఐరన్ రక్తహీనత సమస్యను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని సలాడ్లు, సూప్‌లు లేదా కూరల రూపంలో తీసుకోవడం ఉత్తమం. కాలీఫ్లవర్, బ్రోకలీ, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ వెజిటెబుల్స్ కూడా చలికాలంలో శరీరానికి చాలా మేలు చేస్తాయి. వీటిలో ఫైబర్, విటమిన్ సి పుష్కలంగా లభిస్తాయి. ఇవి శరీరానికి వేడిని ఇవ్వడంతో పాటు, దేహంలోని టాక్సిన్లను బయటకు పంపుతాయి. విటమిన్ సి చలికాలంలో వచ్చే సాధారణ జలుబు, దగ్గు వంటి సమస్యలను నియంత్రిస్తుంది. దొండకాయ, బెండకాయ వంటివి కూడా తేలికగా జీర్ణమవుతాయి కాబట్టి ఈ సీజన్‌లో తీసుకోవచ్చు. చలికాలంలో కఫం, జలుబు సమస్యలు పెరగకుండా ఉండాలంటే శరీరంలో చలిని పెంచే కొన్ని కూరగాయలకు దూరంగా ఉండటం మంచిది. దోసకాయ, బీరకాయ, కాకరకాయ వంటి కూరగాయల్లో అధికంగా నీరు ఉంటుంది. వీటిని ఉదయం లేదా రాత్రి తీసుకుంటే కఫం, జలుబు సమస్యలు మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే ఇవి శరీరంలో చలిని పెంచుతాయి. అలాగే, టమాటను కూడా చలికాలంలో మితంగా తీసుకోవాలి. ఇది కొందరికి కడుపు సంబంధిత సమస్యలను తీసుకురావచ్చు.

## రోజూ జామకాయ తింటే ఏమవుతుంది?



ఏడాది పొడవునా లభించే పండ్లలో జామకాయ ఒకటి.. జామకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. విటమిన్ సీ, అధిక ఫైబర్‌తోపాటు.. ఇతర పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఈ పండు అంటే.. సహజంగానే చాలా మందికి ఎంతో ఇష్టం. ఏడాది పొడవునా లభించే పండ్లలో జామకాయ ఒకటి.. జామకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. విటమిన్ సీ, అధిక ఫైబర్‌తో పాటు.. ఇతర పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఈ పండు అంటే.. సహజంగానే చాలా మందికి ఎంతో ఇష్టం.. అయితే.. ముఖ్యంగా చలికాలంలో జామకాయలు ఎక్కువగా లభిస్తాయి.. ఈ సీజన్‌లో తక్కువ ధరకే జామపండు లభిస్తుంది. పోటిషియంతోపాటు.. అనేక పోషకాలు కలిగిన జామకాయను కనీసం రోజుకు ఒకటి అయినా తినాలంటునానారు ఆరోగ్య నిపుణులు.. ముఖ్యంగా ఈ శీతాకాలంలో జామకాయలను తినడం వల్ల మనకు ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు లభిస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది: జామకాయల్లో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రోగనిరోధక వ్యవస్థ బలోపేతం అయి.. పటిష్టంగా మారుతుంది.. ఇది .. సాధారణ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ముఖ్యంగా దగ్గు, జలుబు, ఫ్లూ నుంచి ఉపశమనం అందిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: జీర్ణక్రియను మెరుగు పరచడంలో జామకాయలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ కాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది కడుపును శుభ్రపరిచి.. విరేచనం సరిగ్గా అయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. బరువును తగ్గించి కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తుంది: జామకాయలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా లైకోపీన్ ఎక్కువగా ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. జామపండులోని తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ బరువు తగ్గడంలో సహాయపడతాయి. గుండెకు మేలు చేస్తుంది: జామపండులోని పోషకాలు పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.. లైకోపీన్ ఆక్సీకరణ ఒత్తిడిని కూడా దూరం చేసి.. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. డయాబెటిస్‌లో మేలు చేస్తుంది: డయాబెటిస్ ఉన్నవారికి జామకాయలు ఎంతో మేలు చేస్తాయి.. ఈ జామకాయ తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది.. అలాగే.. ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. దీనిని రోజు ఒకటి తినడం వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ కూడా నియంత్రణలో ఉంటుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం: జామలోని పోషకాలు ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం కలిగిస్తాయి.. దడు చురుకుదనాన్ని పెంచి.. చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతాయి.

## ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారం ఆరోగ్యకరమేనా!



ప్రస్తుత ఉరుకులుపరుగుల జీవితంలో ప్రెషర్ కుక్కర్ అనేది ప్రతి కిచెన్‌లో ఒక ముఖ్యమైన పాత్రగా మారిపోయింది. తక్కువ సమయంలో, తక్కువ గ్యాస్?తో ఆహారాన్ని త్వరగా వండడానికి ఇది ఉపయోగపడుతుంది. ప్రస్తుత ఉరుకులుపరుగుల జీవితంలో ప్రెషర్ కుక్కర్ అనేది ప్రతి కిచెన్‌లో ఒక ముఖ్యమైన పాత్రగా మారిపోయింది. తక్కువ సమయంలో, తక్కువ గ్యాస్?తో ఆహారాన్ని త్వరగా వండడానికి ఇది ఉపయోగపడుతుంది. అయితే, ప్రెషర్ కుక్కర్‌లో వండిన ఆహారాన్ని తినడం వల్ల ఆరోగ్యానికి హాని కలుగుతుందా? పోషకాలు నశిస్తాయా? అనే ప్రశ్నలు తరచుగా వినపడుతూనే ఉంటాయి. సంప్రదాయ వంట పద్ధతుల్లో పోషకాలు బయటకు పోతాయి. అయితే, ప్రెషర్ కుక్కర్‌లో వంట చేయడం వల్ల పోషకాలు పూర్తిగా నశించవని నిపుణులు చెబుతున్నారు. ప్రెషర్ కుక్కర్ గాలి చొరబడకుండా, తక్కువ నీటితో పనిచేస్తుంది. దీనివల్ల వంట సమయం తగ్గుతుంది. తక్కువ సమయం ఉడికించడం వల్ల విటమిన్ సి, ఫోలేట్ వంటి సున్నితమైన విటమిన్లు కొంతవరకు మాత్రమే నష్టపోతాయి, ఇది సాధారణ ఉడికించడం కంటే మెరుగైన ఫలితం. అయినప్పటికీ, అధిక ఉష్ణోగ్రత, పీడనం కారణంగా కొన్ని రకాల పోషకాలు ముఖ్యంగా బీన్స్, పప్పుధాన్యాలలో మార్పు చెందే అవకాశం ఉంది. ప్రెషర్ కుక్కర్‌లో అధిక వేడి వద్ద బంగాళదుంపలు, బియ్యం వంటి స్టార్చ్ లేదా పిండి పదార్థాలను వండినప్పుడు అవి అక్రిలమైడ్ వంటి హానికరమైన రసాయన సమ్మేళనాలను ఉత్పత్తి చేయవచ్చని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ రసాయనాలు పెద్ద మొత్తంలో తీసుకుంటే ఆరోగ్యానికి హానికరం కావచ్చు. పప్పుధాన్యాలు, చిక్కుళ్ళు ప్రెషర్ కుక్కర్‌లో వండినప్పుడు, వాటిలో ఉండే లెక్టిన్స్ వంటి యాంటీన్యూట్రియంట్స్‌ను పూర్తిగా తొలగించకుండానే జీర్ణం చేయవలసి వస్తుంది. దీనివల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు వచ్చి, గట్ హెల్త్ దెబ్బతినే అవకాశం ఉంది. అంతేకాదు, తక్కువ నాణ్యత గల అల్యూమినియం ప్రెషర్ కుక్కర్‌లను ఉపయోగిస్తే, అధిక వేడి వద్ద ఆ లోహం ఆహారంలో కలిసే ప్రమాదం ఉంది. అందుకే, ఫుడ్‌గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ కుక్కర్‌లను ఉపయోగించడం ఉత్తమం. ప్రెషర్ కుక్కర్ అనేది సమయాన్ని ఆదా చేసే ఒక సౌకర్యవంతమైన సాధనం. సరైన జాగ్రత్తలు తీసుకుని వండిన ఆహారాన్ని తినడం వల్ల పెద్దగా సైడ్ ఎఫెక్టస్ ఉండవు. అయితే, ప్రతిరోజూ ప్రెషర్ కుక్కర్‌పై మాత్రమే ఆధారపడకుండా, సంప్రదాయ వంట పద్ధతులను కూడా అనుసరించడం ఆరోగ్యానికి మరింత మేలు.


## నాన్ వెజ్ మానేస్తున్నారా?



మీరు మాంసాహారం మానేయాలని ఆలోచిస్తున్నారా? ప్రముఖ డయాబెటాలజిస్ట్ ప్రకారం, ఈ నిర్ణయం ఆరోగ్యకరమైన పేగులకు, మెరుగైన గుండె సంబంధిత జీవక్రియ ఆరోగ్యానికి దారి తీస్తుంది. శాకాహారం.. జీర్ణవ్యవస్థలో ఎలాంటి మార్పులు తెస్తుంది, పీచు పదార్థాలు పెరిగితే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఓ ఇంటర్వ్యూలో వివరించారు. మాంసాన్ని పూర్తిగా దూరం చేస్తే మీ పేగుల్లో నిజంగా ఏం జరుగుతుంది? చాలా మంది దీనిని కేవలం డైట్ మార్పు అనుకుంటారు కానీ, ఇది మీ జీర్ణవ్యవస్థను, మీ హృదయాన్ని కొత్తగా మార్చేస్తుంది. మంచి బ్యాక్టీరియా పెరగడం, మంటను అదుపు చేసే ప్రత్యేక ఫ్యాటీ యాసిడ్స్ తయారవ్వడం వంటి అద్భుతాలు లోపల జరుగుతాయి. అయితే, సరైన ప్రణాళిక లేకపోతే విటమిన్ బి12 లోపం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మాంసాహారాన్ని వదిలితే ఆరోగ్యకరమైన జీర్ణాశయం, గుండె సంబంధిత ఆరోగ్యం మెరుగుపడతాయి. అపోలో క్లినిక్ డాక్టర్ యశోధ్ కుమార్ రెడ్డి ఈ విషయం చెబుతున్నారు. శాకాహారం జీర్ణవ్యవస్థలో ఎలాంటి మార్పులు తెస్తుందో డాక్టర్ రెడ్డి వివరించారు. శాకాహారం పీచు పదార్థాలు, మొక్కల పోషకాల వినియోగాన్ని సహజంగా పెంచుతుంది. ఇది జీర్ణక్రియ బాగా సాగడానికి, పేగుల ఆరోగ్యం మెరుగుపరచడానికి కీలకం. మొక్కల ఆధారిత ఆహారం ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా వృద్ధిని ప్రోత్సహిస్తుంది. జీర్ణాశయంలో స్థిరమైన సూక్ష్మజీవుల సమతుల్యతను కాపాడుతుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలలో ఉన్న పీచు పదార్థాలను బైఫిడోబాక్టీరియా, లాక్టోబాసిల్లి వంటి ఆరోగ్యకరమైన సూక్ష్మజీవులు తింటాయి. అలా అవి షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్స్ తయారు చేస్తాయి. ఈ ఎస్.సి.ఎఫ్.ఏలు పేగులలో మంటను గణనీయంగా తగ్గిస్తాయి. పేగు గోడ చుట్టూ రక్షణ కవచం తయారు చేస్తాయి. పీచు పదార్థం పెరగడం వల్ల మలవిసర్జన క్రమంగా జరుగుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. మొక్కల ఆహారాలలో అధికంగా ఉండే పాలీఫెనాల్స్ పేగుల్లో హానికరమైన బ్యాక్టీరియాను తగ్గిస్తాయి. కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

## శరీరంలోని ఈ భాగాల్లో నొప్పి వస్తుందా..?

మూత్రపిండాలు శరీరంలో ఫిల్టర్లుగా పనిచేస్తాయి. ఏదైనా మూత్రపిండ సమస్య మొత్తం శరీరంపై హానికరమైన ప్రభావాన్ని చూపుతుంది. చాలా మంది మూత్రపిండాల వ్యాధి సంకేతాలను విస్మరిస్తారు.. ఇది సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో కిడ్నీలు (మూత్రపిండాలు) ఒకటి.. మూత్రపిండాలు శరీరంలో ఫిల్టర్లుగా పనిచేస్తాయి. ఏదైనా మూత్రపిండాల సమస్య మొత్తం శరీరాన్ని ప్రభావితం చేస్తుంది. మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలలో నొప్పి వస్తుంది. అయితే.. శరీరంలోని కొన్ని ప్రాంతాల్లో నొప్పిని అస్సలు విస్మరించవద్దు.. ఎందుకంటే ఇది మూత్రపిండాలు దెబ్బతిన్నట్లు లేదా మూత్రపిండాలు విఫలమయ్యే తీవ్రమైన సంకేతం కావచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు.. శరీరంలో అనేక లక్షణాలను కలిగిస్తుంది. చేతులు కాళ్ళలో అకస్మాత్తుగా వాపు మూత్రపిండాల వైఫల్యానికి సంకేతం కావచ్చు. శరీరంలోని ఇతర భాగాలలో నొప్పి కూడా మూత్రపిండాలు దెబ్బతిన్న సంకేతం కావచ్చు. మూత్రపిండాలు దెబ్బతినడం వల్ల తీవ్రమైన వెన్నునొప్పి వస్తుంది. కూర్చోవడం లేదా నిలబడటం కష్టంగా ఉంటే, దానిని విస్మరించవద్దు. నొప్పి చాలా రోజులు కొనసాగితే, మీరు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. మూత్రపిండాల సమస్యల వల్ల కూడా పక్కటెముకల నొప్పి వస్తుంది. మూత్రపిండాలు శరీరం వెనుక భాగంలో ఉంటాయి.. కాబట్టి పక్కటెముకల నొప్పిని విస్మరించవద్దు. మీరు చాలా రోజులుగా పక్కటెముకల నొప్పిని ఎదుర్కొంటుంటే, దానిని విస్మరించవద్దు.. సకాలంలో చికిత్స తీసుకోవడం వల్ల తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు ఛాతీ నొప్పి అనిపించవచ్చు.. లేదా ఛాతీలో భారంగా అనిపించవచ్చు.. మూత్రపిండాలు దెబ్బతిన్నప్పుడు, గుండె లైనింగ్, వైద్యపరంగా పెరికార్డియం అని పిలుస్తారు.. తీవ్ర వాపునకు గురవుతుంది.. ఇది ఛాతీ నొప్పికి కారణమవుతుంది. ఈ లక్షణాలను విస్మరించవద్దు.. ఈ శరీర భాగాల్లో నొప్పి.. మూత్ర పిండాల సమస్యలను కచ్చితంగా నిర్ధారించలేమని.. కానీ.. మూత్రంలో మార్పులు, సమస్యల తీవ్రత దృష్ట్యా ముందస్తుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.



## కారం తింటే.. ముక్కు నుంచి నీరు రావడానికి కారణం ఇదే..



కొందరు మిరపకాయలను తినడానికి ఇష్టపడతారు. ఇది తిన తర్వాత కొందరికి ఒకొక్కసారి కళ్లు, ముక్కులో నీరు రావడం మొదలవుతుంది. కారం అధికంగా తింటే ముక్కు, కళ్లలో నుంచి నీళ్లు రావడం సర్వసాధారణం. అయితే ఎందుకు ఇలా కళ్లు, నీరు నుంచి నీరు వస్తుందని ఎప్పుడైనా ఆలోచించారా.? కొందరు మిరపకాయలను తినడానికి ఇష్టపడతారు. ఇది తిన తర్వాత కొందరికి ఒకొక్కసారి కళ్లు, ముక్కులో నీరు రావడం మొదలవుతుంది. కారం అధికంగా తింటే ముక్కు, కళ్లలో నుంచి నీళ్లు రావడం సర్వసాధారణం. అయితే ఎందుకు ఇలా కళ్లు, నీరు నుంచి నీరు వస్తుందని ఎప్పుడైనా ఆలోచించారా.? కారం ఎక్కువైనా సరే.. లేదా మిరపకాయను కోరికిన వెంటనే నోటి నుండి హుస్ అనే శబ్దం చేస్తారు. నోరు మొత్తం మండిపోతుంది. అప్పుడు వెంటనే చేతి నీటి గ్లాసు కోసం వెతుకుతుంది. మరోవైపు ముక్కు, కళ్ళ నుండి నీరు ప్రవహిస్తుంది. ఇలా కారం తిన్న వెంటనే నోరు మండటానికి కారణం చాలా మందికి తేలింది. మీకు ఈ ప్రశ్న కొన్ని సార్లు వచ్చి ఉంటుంది. ఈ విషయంపై అమెరికన్ కెమికల్ సొసైటీ గతంలో ఒక అధ్యయనం చేసింది. ఇందులో ఆసక్తికార విషయాన్ని వెల్లడించింది. మిరపకాయలో కెప్సైసిన్ అనే రసాయనం ఉంటుంది. మిరపకాయకు ఇది ఒక రక్షణ కవచం అని తెలుస్తోంది. ఎందుకంటే జంతువులు, మానవులు ఈ రసాయనాల వలన మిర్చి మొక్కను టచ్ చేయలేరు. ఒక రకంగా కెప్సైసిన్ అనే రసాయనం మిర్చిని కాపాడుతుందన్నమాట.ఈ రసాయన స్వభావంతో నోటికి తగిలిన వెంటనే శరీరంలో మంటను కలిగిస్తుంది. దీని తర్వాత మన శరీరం రక్షణలోకి వెళుతుంది. కెప్సైసిన్ రసాయనం శరీరాన్ని బయటకు పంపించడానికి ప్రయత్నిస్తుంది. అందుకనే శరీరంలోని ముక్కు, కళ్ల నుంచి ఆ రసాయనాన్ని బయటకు పంపించడానికి ప్రయత్నిస్తుంది. దీని కారణంగా ముక్కు, కళ్ళ నుండి నీరు రావడం ప్రారంభమవుతుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in